# ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు

పరిగి, అక్టోబర్ 6: పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి ఆధ్వర్యంలో పూజలు చేసి ఉత్సవాలు జరిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు, మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ సంబురాలు నిర్వహించారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి చిహ్నమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల, గండీడ్ మాజీ ఎంపీపీలు సత్యమ్మ, శాంతి, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫూలే, అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం



స్టడీ సర్కిల్‌ను ప్రారంభిస్తున్న అంబేద్కర్ ప్రజా సంఘం నాయకులు

కొడంగల్, అక్టోబర్ 6: ఫూలే, అంబేద్కర్ ఆశయాలే దేశానికి మార్గదర్శకం అని అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం అన్నారు. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతికి ఫూలే, అంబేద్కర్‌లు ఎంతగానో కృషి చేశారని, అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను గడపగడపకూ విస్తరించేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు కాలె సురేందర్, ఎం, ప్రభాకర్‌తో పాటు సూర్యానాయక్, తిరుపతయ్య, దస్తప్ప, సాయిలు, వెంకటేశ్, మాసాని వెంకటయ్య, హన్మంతు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఆపని డ్రైవర్ ..మాజీ జడ్పీటీసీ ఆగ్రహం



బస్సును ఆపి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ జడ్పీటీసీ చంద్రయ్య

పరిగి, అక్టోబర్ 6: పరిగి పట్టణంలోని సర్కారు దవాఖాన వద్ద వికారాబాద్ వెళ్లే రోగుల కోసం ఆర్టీసీ బస్సును ఆపకపోవడంతో పరిగి మాజీ జడ్పీటీసీ చంద్రయ్య స్వతహాగా తన వాహనంలో రోగులను ఎక్కించుకొని వెళ్లి బస్సు నిలిపి డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పరిగిలోని సర్కారు దవాఖన వద్ద వికారాబాద్ వెళ్లేందుకు నిలబడిన ఇద్దరు బస్సును ఆపాల్సిందిగా కోరగా డ్రైవర్ ఆపకుండా తీసుకువెళ్లారు. దీంతో ఈ విషయాన్ని గమనించిన మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య వారిని తన వాహనంలో ఎక్కించుకొని నస్కల్ వరకు వెళ్లి బస్సును నిలిపి వారిని బస్సులో ఎక్కించారు. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే పేదవారు తమ గ్రామాలకు వెళ్లేందుకు, తదుపరి చికిత్సకు వికారాబాద్‌కు వెళ్లడానికి బస్సులు నిలపాలని కోరినా ఆర్టీసీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ జడ్పీటీసీ తెలిపారు.

# వీధి కుక్కల తరలింపు ప్రారంభం..



కుక్కలను తీసుకు వెళుతున్న సిబ్బంది

తాండూరు, అక్టోబర్ 6: తాండూరు మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలపై వేటు మొదలైంది. కొంత కాలంగా తాండూరులో కుక్కల బెడద ఉండడంతో పాటు పలు మార్లు వ్యక్తులపై దాడి చేయడం, తాజాగా ఓ చిన్నారి ప్రాణం తీసిన కుక్కలపై అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు తాండూరులో కుక్కలు లేకుండా చేస్తున్నారు. ఆదివారం స్పెషల్ టీంతో పట్టుకొని కేర్ సెంటర్‌కు తరలింపు ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందిగా కుక్కలు ఎక్కడ ఉన్నా మున్సిపల్ అధికారులకు వెంటనే తెలుపాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు మున్సిపల్ అధికారులను ప్రజలు అభినందించారు.

# నకిలీ డిస్టిల్డ్ వాటర్ బాటిళ్లు స్వాధీనం




పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ డిస్టిల్డ్ వాటర్ బాటిళ్లు

నవాబుపేట, అక్టోబర్ 6: గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లో అక్రమంగా తయారు చేస్తున్న నకిలీ బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిల్స్ కాటన్లను టాస్క్‌ఫోర్స్, నవాబుపేట పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ కె. అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెద్ద మొత్తంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో మూలమాడ గ్రామానికి చెందిన బంట్వారం భోజిరెడ్డి తన ఇంట్లో నకిలీ బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిళ్లు తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతోనే దాడులు చేసినట్లు తెలిపారు. అశోక్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని నవాబుపేట పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ వాటర్‌ను ఖాళీ బాటిళ్లలో నింపి తాండూరు, తదితర ఆటోమొబైల్స్ దుకాణాలు అధికంగా ఉండే చోట అమ్మకాలు జరిపి సోమ్ము చేసుకుంటున్నారన్నారు. స్వాధీనం చేసుకున్న (సొత్తు) బ్యాటరీ వాటర్ విలువ రూ. 90 వేలు ఉంటుందని అన్నారు. అక్రమ బ్యాటరీ వాటర్ తయారు చేస్తున్న బంట్వారం భోజిరెడ్డి, వాహన యాజమాని రవికిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలి

## ముదిరాజ్‌లు సంఘటితం కావాలి: కాసాని వీరేశ్‌ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్

వికారాబాద్, అక్టోబర్ 6 : రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలని, ముదిరాజ్‌లు ఎవరు పోటీలో ఉన్నా , పార్టీలకు అతీతంగా గెలిపించుకోవాలని ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లిలోని చాయ్ ఇన్ బంకెట్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వికారాబాద్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాసాని వీరేశ్ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని, ముదిరాజ్ లు బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోని మార్చే వరకు పోరాటం సాగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి వంద రోజుల్లో మారుస్తామని చెప్పి, నేటికీ దాని ఊసేత్తడం లేదని మండిపడ్డారు. బీసీ ఏ లోకి మార్చకపోతే ముదిరాజ్ లందరం నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. బీసీ ఏ లోకి వస్తేనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఉద్యోగులకు ప్రమోషన్లు వస్తాయన్నారు. ఐదు శాతం లేని వారి కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకువచ్చి అధిక ఉద్యోగాలు కొల్లగొట్టుకుపోయారని, మనం తలుచుకుంటే బీసీ ఏ లోకి ఎందుకు ప్రభుత్వాలు మార్చవని ప్రశ్నించారు. మొదటగా ముదిరాజ్ నినాదంతో ముందుకు వెళ్లాలని దానితో పాటు బీసీ నినాదం ప్రజల్లోకి తీసుకు పోదామన్నారు. ముదిరాజ్ ఓటర్లు అందరూ పేరు చివరన ముదిరాజ్ అని పెట్టుకుంటే ఎంత మంది ముదిరాజ్ లు ఉన్నారో తెలిసిపోతుం దన్నారు. ఓటర్ లిస్టులు చూస్తే పార్టీలు సైతం ఎన్నికలో ముదిరాజ్ లకు ప్రాధాన్యత ఇచ్చేలా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జిల్లా పరిషత్ చైర్మన్ బరిలో ముదిరాజ్ నాయకులు ఉండాలని, అలాగే బీసీ ఎమ్మెల్యేలు, సర్పంచులు,ఎంపీటీసీ, జడ్పీటీసీలు ఉండాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ లకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో 10 మంది ముదిరాజ్ కార్యకర్తలు బలంగా పని చేయాలని, బూత్ కమిటీలు వేస్తామన్నారు. ముదిరాజ్ సంఘాలు ఎన్ని ఉన్న ముదిరాజ్ మహాసభ తో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శాకం రాములు ముదిరాజ్, నాయకులు ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్, రాములు ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, పాండు ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్ తదితరులు అన్నారు.

# అ'పూర్వ'సమ్మేళనం..



పెద్దేముల్ అక్టోబర్ 6 : : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997-98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరుపుకొన్నారు. 26 సంవత్సరాల తరువాత అందరినీ ఆత్మీయంగా కలుసుకోవడం ఆనందంగా ఉం దని పలువరు అభిప్రాయ పడ్డారు. అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాలయ్య, సుభాన్‌రెడ్డి, వెంకటకిషన్‌రావు, ఆనంద్‌కుమార్, ఆనంద్‌రెడ్డి, హన్మంతు, సంధ్యా రాణి, వారిజ, జగదాంబ, సులోచన, పెద్దేముల్ మాజీ సర్పంచ్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## శేషవాహనంపై ఊరేగిన అనంతపద్మనాభస్వామి

వికారాబాద్, అక్టోబర్ 6 : వికారాబాద్ ఆలంపల్లి శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీ అనంతపద్మనాభస్వామి శేషవాహనంపై ఊరేగారు. ఈ ఊరేగింపులో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



# హామీలను నెరవేరుస్తున్నాం..



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న నేతలు

తాండూరు, అక్టోబర్ 6: తాండూరు మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల్లో యుద్ధప్రాతిపాదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తెలిపారు. ఆదివారం 11వ వార్డులో సైడ్ డ్రైనేజీ పనులను స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్ నీరజ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో మరిన్ని ప్రత్యేక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### చికిత్స పొందుతూ..

# గర్భిణి మృతి

యాలాల,అక్టోబర్ 6: చికిత్స పొందుతూ గర్భిణి మృతి చెందిన ఘటన ఆదివారం తాండూరు పట్టణంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన అక్షిత(21)ను కోస్గి మండలం కొత్తపల్లికి చెందిన రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అక్షిత గర్భం దాల్చడంతో తల్లిగారింటికి వచ్చింది. వైద్య పరీక్షలు నిర్వహించగా శిశువుకు వెన్నెముక సమస్య ఉన్నట్లు, దానిని తొలగించుకోవడమే ఉత్తమమని వైద్యులు సలహా ఇచ్చారు. ఈ క్రమంలో పలు ఆసుపత్రులకు వెళ్లినా ఇదే సమాధానం వచ్చింది. తాండూరు నర్సింగ్ హోమ్‌ను సందర్శించగా ఇక్కడి వైద్యురాలు అదే సలహా ఇచ్చింది. కుటుం బ సభ్యుల అనుమతితో అక్షిత ఆసుపత్రిలో శనివారం చేరింది. ఆదివారం సాయంత్రం అక్షిత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో వైద్య సేవల్లో నిర్లక్ష్యం లేదని, చికిత్స పొందే క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెంది ఉండవచ్చని వైద్యులు తెలిపారు.



# ఘనంగా దసరా ఉత్సవాలు..

కొడంగల్, అక్టోబర్ 6: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందున్న క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మండ పంలో అమ్మవారిని దర్శించుకున్న మహిళలు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు దాండియా, బతుక మ్మ ఆటలతో వేడుకను సంతోషంగా జరుపుకున్నారు.



కొడంగల్, అక్టోబర్ 6: గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన రాజేశ్‌రెడ్డికి బాల్యమిత్రులు ఆదివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా. రవీంద్రయాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డితో పాటు నందారం మధు, పప్పు డాగా, వెంకటరత్నం, శ్రీనివాస్, శరణ్‌కుమార్, అచ్యుతారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో రాణించాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు

తాండూరు రూరల్, అక్టోబర్ 6: వీరశైవలింగాయత్-లింగబలిజలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ అన్నారు. ఆదివారం తాండూరులోని భవానీ ఫంక్షన్ హాల్‌లో తాండూరు నియోజకర్గంలోని అన్ని మండలాల నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవలింగాయత్-లింగబలిజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ చాలా మంది పేదలు ఉన్నారని, వారు ఆర్థికంగా ఎదిగేందుకు కులసంఘం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, రాజకీయాల్లో లింగాయత్ ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తి సురేశ్‌షెట్కర్ ఎంపీగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్నం ఈశ్వరప్ప మాట్లాడుతూ సంఘానికి కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అశ్విని శంకర్, సూర్యశ్రావణి, గాజుల ఈశ్వరప్ప, దీక్షా పాటిల్, శివశరణ్, గిరి, బుచ్చిలింగం, గాండ్ల శివలింగం, ఉదయ్‌శంకర్, గాజుల శివకుమార్, కొండ వీరన్న, బస్వరాజ్, శివకుమార్, అడ్వకేట్ రాజశేఖర్, నాయకులు పటేల్ విజయ్‌కుమార్, పటేల్ ఉదయ్‌కుమార్, తుప్పుడు శేఖర్ తదితరులు ఉన్నారు.

# బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత




కొడంగల్, అక్టోబర్ 6: మండల పరిధిలోని హస్నాబాద్‌కు చెందిన రాజేందర్, ప్యాలమద్ది గ్రామానికి చెందిన మల్లేశ్ సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ సైర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి ఆదివారం బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణాలు చేసే క్రమంలో వస్తువులను జాగ్రత్త పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



పెద్దేముల్, అక్టోబర్ 6 : పెద్దేముల్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ కావలి రవీందర్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. తాండూరు పట్టణం లోని విజ్ఞానపురి కాలనీలో నివాసం ఉండే రవీందర్ పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఏడు సంవత్సరాలుగా రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2011 బ్యాచ్‌కు చెందిన ఈయన శనివారం విధులు ముగించుకొని తాండూరుకు చేరుకొన్నాడు.కాలనీలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలను కూడా వీక్షించాడు. రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు.ఉదయం ఎంతలేపినా నిద్రలేవలేదు. అప్పటికే రవీందర్ మరణించినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించు కొన్నారు. కాగా రవీందర్‌కు భార్య మహేశ్వరీ, ఓ కుమారుడు, ఓ కూతురు ఉన్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి,రూరల్ సీఐ అశోక్,ఎస్ఐ గిరి, ఇతర పోలీసు సిబ్బంది, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఆయన నివాసానికి చేరుకొని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రవీందర్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ లాంఛనాలతో రవీందర్ అంత్యక్రియలు నిర్వహించారు.

# శభాష్ ..రమేశ్



చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా. రవీంద్రయాదవ్

కొడంగల్, అక్టోబర్ 6: కేరళలోని ప్రాచీన విద్య కలరిపయట్టుకు ప్రాణం పోస్తున్నందుకు గాను స్థానిక యువకుడు రమేశ్‌ను పలువురు అభినందించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చిన్నారులకు కలరిపయట్టు విద్యపై శిక్షణ ఇస్తున్న కార్యక్రమాన్ని పలువురు వీక్షించి అభినందించారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా. రవీంద్రయాదవ్, నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను ఢీ కొన్న స్కూటీ.. వ్యక్తి మృతి

పరిగి, అక్టోబర్ 6 : స్కూటీ డివైడర్‌కు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగిలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నర్సయ్యగూడ గ్రామానికి చెందిన పేట రమేశ్ పరిగిలో నివాసముంటున్నారు. శనివారం రాత్రి 11.15 గంటల ప్రాంతంలో పట్టణంలోని కొడంగల్ చౌరస్తా సమీపంలో రమేశ్ స్కూటీపై వెళ్తూ డివైడర్‌కు ఢీకొని కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత..కేసు నమోదు

తాండూరు రూరల్, అక్టోబరు 6: ట్రాక్టర్‌లోఅక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, పట్టుకున్నట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తాండూరు మండలం, నారాయణపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ వెంకట్‌రాంరెడ్డి అనుమతులు లేకుండా కాగ్నావాగులో నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పత్రాలు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కల్తీ యాసిడ్ స్వాధీనం

నవాబుపేట, అక్టోబర్6: కల్తీ యాసిడ్ అమ్ముతున్న వ్యక్తులపై టాస్క్‌ఫోర్స్, నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అరుణ్‌కుమార్ కథనం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్, నవాబుపేట పోలీసులు మండల పరిధిలోని మూలమాడ గ్రా మంలో కల్తీ యాసిడ్‌ను పట్టుకున్నట్లు తెలి పారు. యాసిడ్ టిన్‌లలో డిస్టిల్డ్ వాటర్ కలిపి యాసిడ్‌ను కల్తీ చేసి, అధిక ధరలకు ఒరిజనల్ యాసిడ్ అని అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్ని కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.